


# పరదేశీ కథలు

## - చిట్టే సిద్ధ లలిత



- 118 -

## పెట్రోలు బావులు

అర్థరాత్రి. పరిసరాలు నిద్రమత్తులో జోగుతున్నాయి. ఎడారి గాలి వేడిగా వీస్తోంది. ఉండుండి గుడ్లగూబల అరుపులు, పేరు తెలియని పక్షుల కూతలు వికృతంగా వినపడుతున్నాయి. పాములు కూడా ఆహారం కోసం ఇసుకదిబ్బల్లోనూ, ఎడారి తుప్పల్లోనూ విహరించే వేళ అది.

కొత్తవారికి ఆ పరిసరాలు భయాన్ని కలిగిస్తాయి. అలవాటయితే కానీ రాత్రిపూట అక్కడ సంచరించడం కష్టం. అపాయం ఏ మూలన ఏ రూపంలో పొంచి వుంటుందో తెలియదు. అందుకే అక్కడ పనిచేసేవాళ్ళు వాటన్నిటినీ ఎదుర్కునే మెలకువలను తెలిసికొని వుండాలి. కొత్తగా పనిలో చేరినవారికి ఈ విషయాల్లో కూడా ట్రైనింగ్ వుంటుంది.

అంతే కాదు ఆ ప్రాంతంలో రాబందులు గాల్లో గిరికీలు కొడుతూ బ్రతికున్న మనిషిని కూడా పొడిచి తినాలన్నంత కసిగా తిరుగుతుంటాయి. వాటికంట పడితే ప్రాణంమీద ఆశవదులుకోవాల్సిందే.

ఆ ప్రాంతం కువైట్ పట్టణానికి దూరంగా వుంటుంది. పెట్రోలు బావులు శుద్ధిచేసే కర్మాగారాలు అన్నీ ఊరికి దూరంగానే వుంటాయి. ఎడారి కాబట్టి పరిసరాలు నిర్మానుష్యంగా వుంటాయి. అక్కడ పెట్రోలును శుద్ధిచేసి ట్యాంకర్లలో బయటికి పంపిస్తారు. ఆ నేలంతా పెట్రోలుతో తడిసి వుంటుంది. ఎప్పుడు అంటుకుంటుందో అగ్నిజ్వాలలు ఎగిసిపడతాయో అర్థంకాని విషయం. అందుకే అక్కడ పనిచేసేవారు వళ్ళు దగ్గరుంచుకుని జాగరూకతతో మెలగాలి.

అలా పరదేశాల నుండి వచ్చిన చాలామంది ప్రాణాలు పెట్రోలుకు ఆహుతి అయ్యాయి.

ఆరేళ్ళుగా పెట్రోలు బావుల దగ్గర సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు విజయ్. అతడు అమలాపురం నుండి వచ్చాడు. అతడికి ఒక్కోవారం ఒక్కో షిఫ్ట్ వుంటుంది. ఈ వారం నైట్ షిఫ్ట్ కాబట్టి రాత్రి పదకొండు గంటలకు డ్యూటీకి వచ్చాడు.

రాత్రిపూట పని జరగదు అందుకే వర్కర్స్ పెద్దగా వుండరు. పరిసరాలు నిశ్శబ్దంగా వుంటాయి. గంటకు ఒకసారి చుట్టూ రౌండ్స్ వేసి రావడమే విజయ్ పని. విజయ్ తో పాటూ ఇంకో ముగ్గురు డ్యూటీలో వుంటారు. వాళ్ళు ఆఫీస్ ను ఎంట్రన్స్ ను చూసుకుంటారు. చెప్పాలంటే అపాయం పొంచి వున్న ప్రదేశం అది. లోపల ఎవరూ సిగరెట్ తాగడానికి వీల్లేదు. నిప్పు అనేది ఆ ప్రాంతానికి పెద్ద ముప్పు. ఆ విషయం అందరికీ తెలుసు అందుకే చాలా జాగ్రత్తగా వుంటారు.

బయట సెక్యూరిటీ చెకింగ్ తరువాతే ఆ ప్రాంతంలోకి వర్కర్స్ ను అనుమతిస్తారు. లోపలికి వచ్చేవారి వద్ద లైటర్ లాంటివి వుంటే పనినుండి సస్పెండ్ చేసి విచారిస్తారు. వార్నింగ్ ఇస్తారు. అసలు పొగ త్రాగేవారిని ఆ పనికి వద్దంటారు.

కానీ కొందరు అబద్దం చెప్పి పనిలో చేరిపోతుంటారు. అక్కడ అగ్ని ప్రమాదమంటూ జరిగితే ఆపడం చాలా కష్టం.

నిముషంలో పెట్రోలు టేంకర్స్ అన్నీ పేలిపోతాయి. విజయ్ డ్యూటీ లో చాలా అప్రమత్తంగా వుంటాడు. సిన్సియర్ అని పేరు. అయినా ప్రమాదం చెప్పి రాదు. దురదృష్టవశాత్తూ అదే నిజమయింది.

ఆ రాత్రి డ్యూటీలో వున్న ముగ్గురిలో విజయ్ ఇండియన్, మిగతా ఇద్దరూ ఈజిప్షియన్స్. ఈజిప్ట్ వాళ్ళు సిగరెట్లు, హుక్కాలు పీల్చకుండా వుండలేరు. అసలే చలికాలం. స్వెట్టర్లు వేసుకున్నా శరీరం చలికి వంకర్లు తిరిగిపోతోంది.

బయట ఎంట్రెన్స్ లో వున్న ఇద్దరు ఈజిప్షియన్స్ మంచి పొగరాయుళ్ళు. అలా దూరంగా వెళ్ళి తుప్పల్లో దాచుకున్న సిగరెట్ తీసి కాల్చుకునేవాళ్ళు. ఈ విషయం విజయ్ కు తెలిసినా ఆ ప్రదేశానికి దూరంగా వెళ్ళి పొగ పీల్చుకుని వచ్చేవాళ్ళు కాబట్టి ఏమనలేకపోయేవాడు.

కానీ లోపల మనసులో "వెధవనాయాళ్ళు మాట వినరు" అని గొణుక్కునేవాడు. ఆ రాత్రి కూడా ఈజిప్షియన్స్ గార్డులు గేటు దగ్గర కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

"అబ్బ చలి కొరుక్కుతింటోంది అహ్మద్" అన్నాడు అమర్.

"హా మామూలే కదా ఎడారి చలి. దీన్నుంచి తప్పించుకోవాలంటే దమ్ము పీల్చాలి లేదా అమ్మాయి పక్కలో వెచ్చగా పడుకోవాలి" చెప్పాడు నవ్వుతూ అహ్మద్.

"వాడు విజయ్ ఇటు వస్తున్నాడేమో చూడు అటు వెళ్ళి సిగరెట్ పొగ పీల్చి వస్తాను" అన్నాడు అమర్.

"సరే తొందరగా రా. నేను చూస్తుంటాను వీలయితే తరువాత నేనూ వెళ్ళి వస్తాను" చెప్పాడు అహ్మద్.

హుషారుగా నడుచుకుంటూ వెళ్ళిపోయాడు అమర్.

దాదాపూ కిలోమీటర్ దూరం నడిచి అక్కడ తుప్పల్లో దాచుకున్న సిగరెట్ పెట్టెను లైటర్ ను బయటికి తీసి వెలిగించి గుండె నిండా పొగ పీల్చి వదిలాడు.

కైరోలో ఇంటి దగ్గరుండే భార్య హలీమా గుర్తొచ్చింది. అబ్బ ఇప్పుడు దగ్గర వుంటే ఎంత బావుండు నిట్టూర్చాడు.

అతడికి ఆర్నెల్ల క్రితమే పెళ్ళయింది మరి. కొత్త పెళ్ళికొడుకైనా దినారాల కోసం పరదేశానికి రాక తప్పలేదు.

కానీ అతడు తన కోపాన్ని కంట్రోల్ చేసుకోగలిగితే బావుండేది.

లోపల కాంపౌండ్ చుట్టూ ఒకసారి తిరిగి ఎంట్రెన్స్ దగ్గరికి వచ్చాడు విజయ్. అమర్ లేకపోవడం గమనించి "ఎక్కడ" అని అడిగాడు.

"ఇప్పుడే అటువైపు ఏదో అలికిడి అయితే చూసొస్తా అని వెళ్ళాడు. వచ్చేస్తాడు" అంటూ నవ్వాడు అహ్మద్.

అతడు అటు ఎందుకెళ్ళాడో తెలుసులే అన్నట్టుగా చూసాడు విజయ్.

ఇంతలో విజయ్ ఫోను మోగింది. ఈ సమయంలో డ్యూటీలో వుండగా విజయ్ కు ఫోన్ కాల్స్ రావడం అరుదు.

కానీ ఇండియా నుండి భార్య భరణి కాల్ చేసింది. అక్కడ టైము తెల్లవారుఝాము మూడయినట్లుంది. ఆ సమయంలో కాల్ ఊహించనిది. అందుకే తీసాడు.

"ఎందుకు నిద్రపోలేదు" ప్రేమగా అడిగాడు విజయ్.

“ఏదో పీడకల వచ్చింది. కలలోకి నువ్వొచ్చావు నీతో మాట్లాడాలి అనిపించి చేసాను” చెప్పింది భరణి. ఆ గొంతులో దిగులు. భర్తను మిస్సయిన విచారం.

"నాకోసం బెంగ పెట్టుకుని అలా నిద్రపోకపోతే ఎలా" మందలించాడు విజయ్.

"ఎప్పుడొస్తున్నారు, సెలవు ఎప్పుడు" ప్రశ్నించింది.

"ఇంకెంత ఒక నెల మాత్రమే వుంది. సంక్రాంతికి వచ్చేస్తాను. పిల్లలకు సెలవులుంటాయి కదా. పండగ అయ్యాక తిరుపతి వెళ్దాం" నమ్మకంగా చెప్పాడు విజయ్.

"మిమ్మల్ని చూడాలనిపిస్తోందండీ పిల్లలు కూడా రోజూ నాన్న ఎప్పుడు వస్తాడు అని అడుగుతున్నారు" చెప్పింది భరణి.

"మిమ్మల్ని చూడాలని నేనూ తపించిపోతున్నాను. ఎప్పుడెప్పుడు విమానంలో ఎగిరి వద్దామా అని నిరీక్షిస్తున్నాను. నువ్వు గుర్తొస్తే నిద్ర రావడం లేదు భరణీ. దిల్ తో పాగల్ హై" అన్నాడు విజయ్.

కాసేపు ముచ్చట్లు చెప్పుకున్నారు.

"మర్చిపోకుండా నాకు జాస్మిన్ అత్తరు తీసుకురండి" చెప్పింది ఆమె.

"అదెలా మర్చిపోతాను. రాత్రికి నువ్వు జపాన్ సిల్కుచీర కట్టుకుని అత్తరు పూసుకుంటే నా సామిరంగా ఆ రాత్రి నాకు జాతరే" నవ్వాడు విజయ్.

అటువైపు సిగ్గుపడింది భరణి.

కొద్దిసేపు పిల్లల విషయాలు మాట్లాడి బై చెప్పి కాల్ కట్ చేసాడు విజయ్. డ్యూటీలో ఎక్కువగా కాల్స్ మాట్లాడడు అతడు. కానీ ఈరోజు తప్పలేదు. అర్థరాత్రి ఫోన్ చేసింది భార్య. ఏ అవసరమో ఆపదో అనే ఆదుర్దా వుంటుంది కాబట్టి మాట్లాడాడు.  కానీ ఆమె కలకు ఒక అర్థం వుందని గ్రహించలేకపోయాడు.

రేపు మేనేజర్ ను కలిసి సెలవు అడగాలి, ఇంటికి వెళ్ళాలి అని నిర్ణయించుకున్నాడు విజయ్. కానీ అనుకున్నట్లు అన్నీ జరగవు.

అమర్ తిరిగి వచ్చాక అహ్మద్ పైకి లేచాడు.

"వాడు విజయ్ ఇప్పుడే ఇటు వచ్చి వెళ్ళాడు. నీ గురించి అడిగాడు. ఏదో చెప్పాను. మరలా వచ్చి నన్ను అడిగితే బాత్ రూముకు వెళ్ళానని చెప్పు" అంటూ వెళ్ళిపోయాడు.

"సరే" అని తలూపుతూ ఫోన్ లో మునిగిపోయాడు అమర్.

చలి వణికిస్తోంది. ఆ పరిసరాలను దాటి తుప్పల్లోకి అడుగుపెట్టి దాచుకున్న లైటర్, సిగరెట్ పెట్టెను బయటికి తీసాడు అహ్మద్.

నోట్లో సిగరెట్ వుంచుకుని వెలిగించుకుని గుండెనిండా దమ్ములాగుతూ ఆకాశం వైపు చూసాడు. నిండు చంద్రుడు నవ్వుతూ పలకరించాడు. అదేం మిడిమాలమో ఎడారి వెన్నెల విరగకాస్తోంది ఈరోజు. హాయిగా అనిపించింది.

అటూఇటూ నడుస్తూ సిగరెట్ తాగాడు.

ఒకటి అయింది. ఇంకోటి కూడా తాగాలి అనిపించింది. కానీ అక్కడ అమర్ ఒక్కడే వున్నాడు. విజయ్ వస్తే తను అక్కడ లేకుంటే వప్పుకోడు. మరలా ఇక్కడికి రావాలంటే కుదరదు. ఈ చలిని తప్పించుకోవాలంటే గంటకు ఒక్కసారైనా దమ్ము పీల్చాలి. సిగరెట్ పెట్టె లైటర్ ను తుప్పల్లో పెట్టబోయి ఆగాడు.

వాటిని జాగ్రత్తగా ప్యాంటు జేబులోకి తోసాడు. హా ఏమవుతుంది. వాడు ఆ విజయ్ కంట పడకుండా నిప్పు నేలను తాకకుండా తాగితే సరి అనుకుని హుషారుగా నడుచుకుంటూ తిరిగి వచ్చాడు.

అప్పటికి అమర్ కుర్చీలో కూర్చుని కునికిపాట్లు పడుతున్నాడు.

"హేయ్ అమర్ నిద్రపోకు. లెయ్" అంటూ అమర్ ను లేపాడు.

"హజ్జీ నాకు నిద్ర వస్తోంది. కాసేపు నన్ను వదిలేసి నువ్వు డ్యూటీ చూసుకో" అంటూ కళ్ళు మూసుకున్నాడు అమర్.

కాసేపు అటు ఇటు పచార్లు చేసాడు అహ్మద్. అజయ్ వస్తున్నాడేమో అని చూసాడు. రావడంలేదని నిశ్చయించుకుని మెల్లగా సిగరెట్ ను బయటికి లాగాడు. ఎవరన్నా చూస్తే ఎలా అనుకుంటుంటే చేతులు వణికాయి.

ఒకటే కదా ఎంతసేపు? ఏమీ కాదులే తనకు తానే సర్ది చెప్పుకున్నాడు. లేచి కేబిన్ కు అటువైపుకు వెళ్ళి చాటుగా కూర్చుని లైటర్ తో వెలిగించి ఒక దమ్ము పీల్చాడు.

హాయిగా వుంది. గుండెలో వెచ్చగా వుంది. అరమోడ్పు కళ్ళతో రెండో దమ్ము పీల్చాడు. ఇంతలో లేచిన అమర్

"హజ్జీ సిగరెట్ తాగుతున్నావా" అని అడిగాడు.

ఉలిక్కిపడ్డాడు అహ్మద్.

"హా అదీ అదీ ఒక్కటే" అంటూ నసిగాడు.

"సర్లే. నాకూ పిచ్చిపిచ్చిగా వుంది. అయ్యాక నాకూ ఒక్కటి ఇవ్వు" అన్నాడు ఆవలిస్తూ.

కుదుటపడి సిగరెట్ కాల్చేసి ఇవతలికి వచ్చి లైటర్, సిగరెట్ అమర్ కు అందించాడు అహ్మద్.

"ఆ విజయ్ ఇటు వస్తే చెప్పు. వాడొక వెధవ. చూస్తే రేపు మేనేజర్ కు చెప్పి ఉద్యోగం ఊడగొట్టిస్తాడు" అంటూ గోడ చాటుకు వెళ్ళాడు. ఆ ప్రదేశమంతా పెట్రోలుతో తడిసి ఒక విధమైన చెమ్మతో నిండి వుంటుంది.

కొన్ని ఏళ్ళుగా పెట్రోలు ఇంకిన ప్రదేశం అది.రోజంతా పెట్రోలు శుద్ధి చేసి ట్యాంకర్లలో నింపి పంపించడమే అక్కడ పని. దాదాపూ వందమంది ఇంజనీర్లు నాలుగు వేలమంది వర్కర్స్ పని చేసే చోటు అది.

చుట్టూ పెట్రోలుతో తడిసిన నేల కాబట్టి అదో ప్రమాదకరమైన ప్రదేశం. గాలి కూడా పెట్రోలు వాసనతో నిండిపోయి గమ్మత్తుగా, ఒకరకమైన వెగటుతో నిండి వుంటుంది. చాలా ఏళ్ళు అక్కడ పనిచేస్తే ఆస్తమా లాంటి జబ్బులు వచ్చే ఆస్కారం కూడా వుంది. వారందరికీ అలవాటయింది కాబట్టి పెద్ద ఇబ్బందిగా అనిపించదు.

కొత్తవారికి ఊపిరి పీల్చడం కూడా కష్టమే. అమర్ తొందరగానే లోపలికి వచ్చేసాడు.

"ఆ బెంగాలీకి ఫోన్ చేసి నాలుగు టీలు, బిస్కట్ పేకెట్స్ తెమ్మని చెప్పు హజ్జీ. టీ తాగితే నిద్రమత్తు వదులుతుంది" ఆవులిస్తూ చెప్పాడు అమర్.

"నీదెప్పుడూ నిద్ర మొహమే. నైట్ డ్యూటీల్లో నిద్రపోతే ఎలా.? మేనేజర్ కు తెలిస్తే నిన్ను ఈజిప్ట్ కు పంపిస్తాడు" సీరియస్ గా చెప్పాడు అహ్మద్.

"సర్లే అప్పుడు చూద్దాం.

మొన్న ఆ మేనేజర్ రెసెప్షనిస్ట్ తో క్యాబిన్ లో సరసాలాడటం నేను చూసాను. అప్పటినుండీ నన్ను ఏమీ అనడు" అంటూ కిసుక్కున నవ్వాడు అమర్.

అతనితో జత కలిపి బిగ్గరగా నవ్వేసాడు అహ్మద్.

"ఏంటి నవ్వులు వినబడుతున్నాయి, ఏంటి విశేషం" అంటూ అక్కడికి వచ్చాడు విజయ్.

"మాఫీ షై." (ఏమీలేదు) అన్నాడు అమర్.

ఇంతలో బెంగాలీ ఫ్లాస్క్ లో టీ తీసుకొచ్చాడు. అతడు ఒక కిలో మీటర్ దూరంలో వున్న కెఫ్టేరియా లో టీ కాచి తీసుకొస్తాడు.

"ఈ చలిలో వేడివేడి టీ బాగుంది బెంగాలీ" చెప్పాడు అమర్

"నా పేరు బెంగాలి కాదు సమీర్" అన్నాడు అతడు కాస్త మొహం ముడిచి.

సరేలే బంగ్లాదేశ్ నుండి వచ్చావు కాబట్టి నువ్వు బెంగాలీనే అన్నాడు అమర్ అతడ్ని వుడికిస్తూ.

"నన్ను పేరుతోనే పిలువు లేదంటే నిన్ను మస్రీ అని అంటాను" వాదనకు దిగాడు బెంగాలి.

విజయ్ వాళ్ళకు సర్ది చెప్పబోయాడు.

కానీ ఇద్దరూ వినలేదు.

"మరోసారి నన్ను మస్రీ అను చూద్దాం. అంటే పళ్ళు రాలతాయ్" అన్నాడు అమర్ కోపంగా.

కాసేపటికి వాదులాట తారాస్థాయికి చేరింది. అరబ్బీలో తిట్టుకోవడం మొదలుపెట్టారు.

"రేపు మీమీద కంప్లైంట్ చేస్తే ఉద్యోగం నుండి ఊడపీకుతారు. మర్యాదగా పోట్లాట ఆపండి" గద్దించాడు విజయ్.

ఉద్యోగం పోతుంది అన్నమాట వినడంతో కాస్త తగ్గారు.

ఖాళీ కప్పులు బెంగాలీకి ఇచ్చి వాడ్ని బలవంతంగా అక్కడ్నుంచి పంపించేసారు.

తాగిన టీ చేదుగా అనిపించింది అమర్ కు. బెంగాలీ అంతు చూడాలి అనుకుంటూ పళ్ళు కొరికాడు.

ఈజిప్ట్ వాళ్ళు మూర్ఖులు. పంతానికి పోతే వదలక సాధిస్తారు. బెంగాలీలు కూడా తక్కువేమీ కాదు.

మాటల్లోనే తెల్లారింది. ముగ్గురూ డ్యూటీ దిగి రూములకు పోయి తిని పడుకుని నిద్రపోయారు.

మరుసటి రోజు రాత్రి డ్యూటీకి వచ్చాక అమర్ బెంగాలీని టీ తీసుకు రమ్మన్నాడు.

"నువు చెప్తే నేను రాను, నీకు టీ ఇవ్వను పో" అనేసాడు సమీర్.

అమర్ కు కోపం వచ్చింది. బెంగాలీకి బుద్ధి చెప్పాలి అని నిశ్చయించుకున్నాడు. అహ్మద్ కు చెప్పి టీ తెప్పించమన్నాడు.

అహ్మద్ సరే అని ఫోన్ చేసి సమీర్ ను టీ తెమ్మన్నాడు. ఇక తప్పదని, అహ్మద్ చెప్పాడని టీ ఫ్లాస్క్ తో వచ్చాడు సమీర్.

అమర్ దుర్మార్గుడని తెలుసు అందుకే సమీర్ కు మనసులో భయంగానే వుంది. తెచ్చిన టీని కప్పుల్లో పోసి అందరికీ ఇచ్చాడు.

అనుకున్నట్లుగానే అమర్ గొడవకు సిద్ధమయి "ఏయ్ బెంగాలీ" అని పిలిచాడు.

సమీర్ తగ్గలేదు.

"హా చెప్పు మస్రీ" అని తిరుగు జవాబు ఇచ్చాడు.

వళ్ళు మండింది అమర్ కు. సమీర్ జుట్టు పట్టుకుని చెంప మీద కొట్టాడు.

సమీర్ కూడా రెచ్చిపోయి "మస్రీ నాకొడకా నన్ను కొడతావా?" అంటూ కలబడ్డాడు.

"నిన్ను పెట్రోల్ పోసి తగలబెడతారా బెంగాలీ మృగమా" అంటూ ఆవేశంగా పెట్రోల్ టిన్ తెచ్చి సమీర్ మీద పోసాడు అమర్.

అహ్మద్, విజయ్ వాళ్ళను వారించలేక, విడదీయలేక అలసిపోయారు.

“పెట్రోల్ పోసావు కదా దమ్ముంటే కాల్చరా మస్రీ కుక్కా” అని అరిచాడు సమీర్.

ఆ పరిసరాల్లో అగ్గిపెట్టె కానీ లైటర్ కానీ వుండదని ధీమా అతడిది.

కానీ వాళ్ళ కోసం ఆరాత్రి అక్కడ మృత్యువు పొంచి వుంది.

మూర్ఖుడైన అమర్ కు చటుక్కున రాత్రి దాచిన సిగరెట్ పెట్టె లైటర్ గుర్తొచ్చింది.

టేబుల్ కింద వెతికాడు.

లైటర్ ను తీసి వెలిగించి మీదికొస్తున్న సమీర్ కు అంటించేసాడు. అమర్ ఇంత పని చేస్తాడని ఇలా జరుగుతుందని ఎవ్వరూ ఊహించలేదు. ఏదైతే జరగకూడదో అదే జరుగుతోంది.

సమీర్ ను రక్షించాలని ప్రయత్నించిన విజయ్, అహ్మద్ లను కూడా మంట చుట్టుముట్టింది. హాహాకారాలతో ఆ ప్రదేశం దద్దరిల్లింది.

మంట అమర్ కు కూడా అంటుకుని శరవేగంగా నేల మీద నలుదిశలకూ పాకుతోంది.

పెట్రోల్ ట్యాంకర్లు పేలితే ఆ మంటలు ఆర్పడం ఎవరి తరమూ కాదు. ఆ నష్టం దినారాలకు అందనిది. వాటిని కాపాడటం తన విధి. విజయ్ కు కాస్త దూరంలో వున్న ఫైర్ ఎస్టింగ్విషర్ గుర్తొచ్చింది.

పరిగెత్తి వెళ్ళి ఆ సిలిండర్ ను పట్టుకొచ్చి ఓపెన్ చేసి మంటలు వ్యాపించకుండా పైపుతో నేల మీద కొట్టాడు. అదృష్టవశాత్తూ మంటలు ఆగిపోయాయి.

తన శరీరం మండిపోతుంటే ఇసుకలో పొర్లాడాలని బయటికి పరిగెత్తాడు.

అప్పటికే గేటు వద్ద వున్న అహ్మద్, అమర్, సమీర్ మంటల్లో కాలిపోయారు.

విజయ్ కు కూడా శరీరం సగం కాలిపోయింది. ఎడారి ఇసుకలో దొర్లుతూ స్పృహ తప్పి పడిపోయాడు.

పరదేశులై పని కోసం వచ్చిన ముగ్గురి ప్రాణాలు ఆ ఆయిల్ కంపెనీలో ఆహుతి అయ్యాయి. ఇంటికి పంపేందుకు కాలి కమురు కంపు కొడుతున్న శవాలు మాత్రమే మిగిలాయి. ఆవేశం అనర్థదాయకమని, ప్రాణాలకు ముప్పని ఋజువయింది

విజయ్ కళ్ళు తెరిచేటప్పటికి హాస్పిటల్లో వున్నాడు. విజయ్ ది అదృష్టమో దురదృష్టమో గుర్తుపట్టలేని విధంగా ప్రాణంతో మిగిలాడు. అతడి శరీరం కాలిపోయి ఆకారం మారిపోయింది. అతడి రూపం వికృతంగా తయారయింది.

ట్యాంకర్స్ కు మంటలు వ్యాపించకుండా అడ్డుకున్న విజయ్ సాహసాన్ని గుర్తించిన ఆయిల్ కంపెనీ అతడికి మంచి ట్రీట్మెంట్ ఇప్పించింది.

భారీగా కువైట్ దినారాలు ముట్ట చెప్పి సగౌరవంగా ఇండియాకు పంపించింది.

"సంక్రాంతికి వస్తా" అన్న భర్త రూపు మారిపోయి గుర్తించలేని స్థితిలో ఇంటికి రావడంతో ఆ భార్య బిడ్డల బాధ వర్ణనాతీతం.

తరాలు తిన్నా తరగని సంపదను పెట్రోల్ కంపెనీ ఇచ్చింది కానీ ప్లాస్టిక్ సర్జన్స్ కూడా సరిచేయలేని తన రూపాన్ని చూసుకుని కుమిలిపోతున్నాడు విజయ్.

భార్య ధరణి అతడికి అండగా నిలవడం కొంత ఊరట.

(మరోకథ వచ్చేనెలలో)

Post your comments